

## హైదరాబాద్-మాల్దీవ్స్ మధ్య ఇండిగో ఫ్లైట్లు తిరిగి ప్రారంభం

హైదరాబాద్, అక్టోబర్ 31: హైదరాబాద్ నుంచి మాల్దీవ్స్ మధ్య ప్రయాణికులు పెరుగుతుండటంతో తిరిగి విమాన సేవలను ఆరంభించింది ఇండిగో సంస్థ. 6ఈ-1797 సర్వీసు నంబర్ కలిగిన ఇండిగో ఫ్లైట్ హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయం నుంచి మధ్యాహ్నం 12.40 గంటలకు బయలుదేరి మాలే ఎయిర్‌పోర్ట్‌కు మధ్యాహ్నం 2.50 గంటలకు చేరుకున్నది. తిరిగి ప్రయాణంలో మధ్యాహ్నం 3.55 గంటలకు బయలుదేరి హైదరాబాద్‌కు సాయంత్రం 6.45కి చేరుకోనున్నది. ఈ నాన్-స్టాప్ ఫ్లైట్ సర్వీసు మంగళ, గురు, శనివారాలు మాత్రమే నడవనున్నది.

## హైదరాబాద్‌పై ప్రైమ్‌ఎరా కన్ను

### లీజుకు భారీ ఆఫీస్ స్పేస్..

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 31 (నమస్తే తెలంగాణ): బహుళజాతి కంపెనీలు నగరంలో తమ కార్యకలాపాలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ప్రాధాన్యతనిస్తున్నాయి. తాజాగా అమెరికాకు చెందిన హెల్త్‌కేర్ కంపెనీ ప్రైమ్ ఎరా సైతం.. ఐటీ కారిడార్‌లో భారీ విస్తీర్ణంలో ఆఫీస్ స్పేస్‌ను లీజుకు తీసుకున్నది. మెడికల్ టెక్నాలజీస్‌లో అత్యాధునిక సేవలను అందించేందుకు ఈ కార్యాలయ స్థలాన్ని పొందింది. మాదాపూర్‌లోని జైన్ సద్గురు క్యాపిటల్ పార్క్ భవనంలో సుమారు 1.48 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ ఆఫీస్ స్పేస్ ఉన్నది. కరోనా తగ్గుముఖం పట్టిన దగ్గర్నుంచి ఆఫీస్ స్పేస్ లీజింగ్‌లో హైదరాబాద్ దూసుకుపోతున్నది. అనరాక్.. ఏటా విడుదల చేసే నివేదిక కూడా ఇదే చెప్తున్నది. ఎక్కువ మొత్తంలో ఆఫీస్ స్పేస్‌ను అందుబాటులోకి తెస్తున్న నగరాల్లో హైదరాబాద్ ప్రధానంగా ఉంటున్నది మరి. ఆఫీస్ స్పేస్‌కు డిమాండ్ ఉండటంతో రియల్ ఎస్టేట్ సంస్థలు ఏ గ్రేడ్ కార్యాలయ స్థలాలను అందుబాటులోకి తెస్తున్నాయి. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగంలోని కంపెనీలు తమ కార్యాలయాల ఏర్పాటుకు ముందుకొస్తున్నాయి.


# చతికిలపడిన మౌలిక రంగాలు

## నాలుగు నెలల కనిష్ఠానికి వృద్ధి రేటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: ఆర్థిక వ్యవస్థకు కీలకమైన 8 మౌలిక రంగాలు నీరసించిపోయాయి. 2023 సెప్టెంబర్ నెలలో వీటి వృద్ధి రేటు 4 నెలల కనిష్ఠానికి పడిపోయింది. రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, సిమెంట్, విద్యుత్ ఉత్పత్తి తగ్గుముఖం పట్టడం, ముడి చమురు ఉత్పత్తి దెబ్బతినడంతో సెప్టెంబర్‌లో 8 కీలక మౌలిక రంగాల వృద్ధి రేటు 8.1 శాతానికి పరిమితయ్యినట్టు మంగళవారం విడుదలైన అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంతక్రితం 2023 మే నెలలో 5.2 శాతం కనిష్ఠవృద్ధిని కనపర్చిన ఈ రంగాలు జూన్, జులైల్లో 8.4 శాతం చొప్పున, ఆగస్టులో 12.5 శాతం మేర వృద్ధి చెందాయి. కానీ సెప్టెంబర్‌లో తిరిగి వృద్ధి రేటు 8.1 శాతానికి తగ్గింది. నిరుడు ఇదే నెలలో వృద్ధి రేటు 8.3 శాతంగా ఉంది.

### ఆరు నెలల్లోనూ ఇదే తీరు

ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబర్ ఆరు నెలల కాలంలో కూడా గత ఏడాదితో పోలిస్తే మౌలిక రంగాల వృద్ధి 9.8 శాతం నుంచి 7.8 శాతానికి తగ్గింది. సెప్టెంబర్ నెలలో రిఫైనరీ ఉత్పత్తుల వృద్ధి 5.5 శాతానికి నెమ్మదించగా, ఎరువుల ఉత్పత్తి వృద్ధి రేటు 4.2 శాతానికి, సిమెంట్ ఉత్పత్తి వృద్ధి 4.7 శాతానికి, విద్యుదుత్పత్తి వృద్ధి 9.3 శాతానికి పరిమితమయినట్టు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ వివరించింది. క్రూడాయిల్ ఉత్పత్తి 0.4 శాతం క్షీణించింది. కానీ బొగ్గు ఉత్పత్తి గణనీయంగా 16.1 శాతం పెరగడం గమనార్హం. సహజవాయువు ఉత్పత్తి 6.5 శాతం, ఉక్కు ఉత్పత్తి 9.6 శాతం చొప్పున వృద్ధిచెందాయి. ఈ కీలక రంగాల వృద్ధిని పరిశీలిస్తే, త్వరలో వెల్లడికాబోయే పారిశ్రామికోత్పత్తి వృద్ధి సైతం సింగిల్ డిజిట్‌కు పరిమితం కావచ్చని ఇక్రా చీఫ్ ఎకనామిస్ట్ అదితి నాయర్ అంచనా వేశారు. పారిశ్రామికోత్పత్తి సూచి (ఐఐపీ)లో ఈ 8 మౌలిక రంగాలకు 40 శాతం వెయిటేజి ఉన్నది.





ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్ విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2023 నిర్వహించింది. బెంగళూరులోని ప్రధాన కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి బ్యాంక్ ఎండీ, సీఈవో సత్యనారాయణ రాజుతోపాటు బ్యాంక్ ఈడీలు దేబాశిష్ ముఖర్జీ, హర్దీప్ సింగ్ అహ్లువాలియా, భావేంద్ర కుమార్ తదితరులు హాజరయ్యారు. 'సే నో టూ కరప్షన్, కమిట్ టూ ది నేషన్' అనే థీమ్‌తో నవంబర్ 5 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

## హైదరాబాద్‌లో స్విమ్‌లేన్

### 200 మంది సిబ్బందిని నియమించుకోనున్న సంస్థ

హైదరాబాద్, అక్టోబర్ 31: కృత్రిమ మేధస్సు ఆధారంగా సెక్యూరిటీ ఆటోమేషన్ సేవలు అందించే స్విమ్‌లేన్..హైదరాబాద్‌లో ప్రాంతీయ సైబర్‌సెక్యూరిటీ ఇన్నోవేషన్‌తోపాటు ఆర్ అండ్ డీ సెంటర్‌ను మంగళవారం ప్రారంభించింది. ప్రాంతీయంగా సైబర్‌సెక్యూరిటీ ఇన్నోవేషన్ సేవలకోసం ప్రారంభించిన ఈ సెంటర్‌లో ప్రస్తుతం 70 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తుండగా, వచ్చే ఏడాది చివరి నాటికి సిబ్బంది సంఖ్యను 200కి పెంచుకోనున్నట్లు స్విమ్‌లేన్ చీఫ్ టెక్నాలజీ అధికారి ఫ్రాన్స్ జవేర్ తెలిపారు. ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ హబ్‌గా ఈ సెంటర్‌ను తీర్చిదిద్దనున్నట్లు, ముఖ్యంగా ఇంజినీరింగ్, కస్టమర్లకు ప్రత్యేక సేవలు అందించడానికి ఈ సెంటర్‌ను నెలకొల్పినట్టు చెప్పారు. పరిశోధన, ప్రతిభ కలిగిన సిబ్బంది హబ్‌గా కొనసాగుతున్న నగరంలో నూతన కార్యాలయాన్ని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉన్నదని, సైబర్ సెక్యూరిటీలో సెక్యూరిటీ ఆటోమేషన్ చాలా కీలకమని, ఈ పరిశోధన కేంద్రంతో ఆటోమేషన్ రంగంలో కీలక పాత్ర పోషించడానికి వీలు పడనున్నదన్నారు.

### భారత్‌లో మరింత విస్తరణ

అత్యధిక వృద్ధిని నమోదు చేసుకుంటున్న భారత్‌లో తన వ్యాపారాన్ని మరింత విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు. 2027 నాటికి భారత్‌లో సైబర్‌సెక్యూరిటీ మార్కెట్ 3.5 బిలియన్ డాలర్లకు చేరుకుంటున్నదన్న అంచనాతో ఇక్కడ మరో ఆర్ అండ్ డీ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని గతంలోనే నిర్ణయించినట్టు తెలిపారు. ప్రతిభ, టెక్నాలజీ కోసం భవిష్యత్తులోనూ పెట్టుబడులు పెట్టనున్నట్టు ప్రకటించిన ఆయన..సెక్యూరిటీ ఆటోమేషన్ విప్లవాత్మక మార్పులు సృష్టించనున్నదన్నారు.

# పడిపడి లేచె పసిడి

### జూలై-సెప్టెంబర్‌లో 10% పెరిగిన డిమాండ్ • 210.2 టన్నులకు కొనుగోళ్లు, పెట్టుబడులు
### తాజా నివేదికలో వెల్లడించిన డబ్ల్యూజీసీ • రాబోయే ధనత్రయోదశికి ధరల సెగ



న్యూఢిల్లీ, అక్టోబర్ 31: దేశంలో బంగారానికి ఆదరణ పెరిగింది. ప్రపంచంలోనే రెండో అతిపెద్ద పసిడి వినియోగదారుగా ఉన్న భారత్‌లో.. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికం (క్యూ3)లో గోల్డ్ డిమాండ్ 210.2 టన్నులుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో 191.7 టన్నులుగా నగల కొనుగోళ్లు, కడ్డీలు-నాణేలపై పెట్టుబడులుండగా, ఈసారి 10 శాతం పెరిగినట్టు మంగళవారం విడుదలైన ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా గణాంకాల్లో తేలింది. కాగా, నగలతో పోల్చితే బంగారు కడ్డీలు, నాణేలకు గత త్రైమాసికంలో డిమాండ్ ఎక్కువైందని ఈ సందర్భంగా డబ్ల్యూజీసీ ఇండియా ప్రాంతీయ సీఈవో సోమసుందరం పీఆర్ తెలిపారు.

### ధరలు తగ్గితే..

దేశీయ మార్కెట్‌లో బంగారం ధరలు తగ్గితే డిమాండ్ మరింత పుంజుకోవచ్చన్న అభిప్రాయాన్ని సోమసుందరం వ్యక్తం చేశారు. తులం రూ.60,000 పలుకుతున్నా కొనేందుకు ముందుకొస్తున్నారన్న ఆయన ధర తగ్గితే కొనుగోళ్లు ఇంకా పెరుగవచ్చన్న అంచనాను వెలిబుచ్చారు. నిజానికి ఈ జూలై-సెప్టెంబర్‌లో గోల్డ్ రేట్లు కొంత దిగొచ్చాయని, దీనికితోడు పండుగ సీజన్ కూడా అమ్మకాలను పెంచాయని చెప్పారు. దక్షిణాది మార్కెట్‌లో లావాదేవీలు ఆకర్షణీయంగా జరిగినట్టు వెల్లడించారు. అయితే ఇప్పుడు ధరలు మళ్లీ పెరగడం మొదలైందన్నారు. ఈ ట్రెండ్ ఇలాగే కొనసాగితే రాబోయే ధనత్రయోదశి, పెండ్లిళ్ల సీజన్‌లో అమ్మకాలు ప్రభావితమయ్యే వీలుందని వ్యాఖ్యానించారు. అయినప్పటికీ బడా వ్యాపారులు కస్టమర్లను రివార్డులు, ఆఫర్లతో ఆకట్టుకుని తమ మార్కెట్ వాటాను కాపాడుకుంటారన్న విశ్వాసాన్నీ ప్రదర్శించారు.

### 18-14 క్యారెట్‌కు డిమాండ్

22 క్యారెట్ జ్యుయెల్లరీ కంటే 18 క్యారెట్, 14 క్యారెట్ బంగారు నగలకే మార్కెట్‌లో డిమాండ్ ఉన్నట్టు డబ్ల్యూజీసీ తెలియజేసింది. పెరుగుతున్న పసిడి ధరలే ఇందుకు కారణమని పేర్కొన్నది. అయితే ఈ పరిణామం నగల వ్యాపారులకు లాభదాయకంగా మారుతున్నట్టు చెప్పింది. 22 క్యారెట్ ఆభరణాల కన్నా 18-14 క్యారెట్ ఆభరణాల్లో ఎక్కువగా రాబడి ఉంటున్నట్టు చెప్పింది. ఇకపోతే ధరల్లో స్థిరత్వం లోపించిన నేపథ్యంలో నగల కంటే బంగారు కడ్డీలు, నాణేలపై పెట్టుబడులకే ఎక్కువమంది మొగ్గుచూపుతున్నారు. ధరలు ఇంకా పెరిగితే బార్స్, కాయిన్స్‌కు డిమాండ్ ఉంటుందన్న అభిప్రాయాలు ఉన్నాయి.

### ఈ జూలై-సెప్టెంబర్‌లో..

- బంగారు నగలకు డిమాండ్ 7 శాతం ఎగిసి 155.7 టన్నులకు చేరిక. నిరుడు 146.2 టన్నులే.
- కడ్డీలు, నాణేలకు 20 శాతం పెరిగిన ఆదరణ. గతంతో పోల్చితే 45.4 టన్నుల నుంచి 54.5 టన్నులకు చేరిక.
- దేశంలో బంగారు కడ్డీలు, నాణేలపై పెట్టుబడులు 2015 నుంచి జూలై-సెప్టెంబర్ త్రైమాసికాల్లో గమనిస్తే ఈసారే అత్యధికం.
- భారతీయ పసిడి దిగుమతులు 220 టన్నులుగా నమోదు. గత ఏడాది జూలై-సెప్టెంబర్‌లో 184.5 టన్నులు.
- ఈ ఏడాది జనవరి-సెప్టెంబర్ మధ్య 563 టన్నుల పుత్తడి దిగుమతులు. గత ఏడాది మొత్తంగా 650.7 టన్నులుగా ఉన్న దిగుమతులు. ఈ డిసెంబర్‌కల్లా ఇంతకుమించి అవుతాయన్న అంచనాలు.
- ఈ జనవరి-సెప్టెంబర్‌లో బంగారం డిమాండ్ 481.2 టన్నులు. డిసెంబర్ కల్లా 700-750 టన్నులకు చేరవచ్చని అంచనా. గత ఏడాది మొత్తంగా 774 టన్నులుగా ఉన్నది.
- అంతర్జాతీయంగా 6 శాతం క్షీణించిన గోల్డ్ డిమాండ్. 1,147.5 టన్నులకు పరిమితం.
- నగల డిమాండ్ 578.2 టన్నులుగా, కడ్డీలు-నాణేలకు ఆదరణ 296.2 టన్నులుగా, గోల్డ్ బార్స్, కాయిన్స్, ఈటీఎఫ్‌ల్లో పెట్టుబడులు 157 టన్నులుగా ఉన్నాయి.
- ఆయా దేశాల సెంట్రల్ బ్యాంకుల నుంచి బంగారు కడ్డీలు, నాణేలకు తగ్గిన ఆదరణ. ఈ జూలై-సెప్టెంబర్‌లో చైనాలో పసిడి డిమాండ్ స్వల్పంగా పెరిగి 247 టన్నుల వద్దే. నిరుడు ఇదే వ్యవధిలో 242.7 టన్నులు.

చిత్రం

# అస్సలు టెన్షన్ లేదు



*గెలవడం గొప్ప.. గెలుస్తూ పదుగురిని గెలిపించడం ఇంకా గొప్ప. వ్యక్తి పరిశ్రమగా మారినప్పుడే ఇలాంటివి జరుగుతుంటాయి. అందుకు ఉదాహరణే తరుణ్‌భాస్కర్. తాను గెలుస్తుంటాడు. ఆ గెలుపులోంచి చాలామంది పుట్టుకొస్తుంటారు. అలా వచ్చినవాళ్లలో హీరోలున్నారు. దర్శకులున్నారు. కమెడియన్స్ కూడా ఉన్నారు. శుక్రవారం రాబోతున్న 'కీడా కోలా' సినిమాతో ఇంకొంతమంది వస్తారు. మొత్తంగా తరుణ్‌భాస్కర్ అంటే సినిమావాళ్లను తయారు చేసే కర్మాగారం. ఆ కర్మాగారంతో సరదాగా ముచ్చటించడం జరిగింది. ఆ వివరాలివి.*

**కల నెరవేరింది**

రోడ్‌పై ఉండే మ్యాన్ హోల్ కవర్ తీసుకెళ్లి ఇనుప సామాన్లవాళ్లకు అమ్మేస్తున్నారు. ఈజీగా డబ్బులొచ్చేస్తాయి కదా. అలాగే తినే పదార్థాల్లో పురుగు కనిపించిందనుకోండి దానిపై లీగల్‌గా ప్రొసీడై డబ్బు సంపాదించుకోవచ్చు. ఈజీగా డబ్బు సంపాదించడంలో ఇది కూడా ఓ విధానం. దగ్గరగా చూస్తే క్రైమ్‌గా కనిపించే ఇవే.. దూరంగా చూస్తే కామెడీగా అనిపిస్తాయి. 'ఇదేదో బావుంది కదా.. దీన్ని చూపిస్తే పోలా' అనే చిన్న చిలిపి ఆలోచన. ఫ్రెండ్స్‌తో చర్చించి నిర్ణయం తీసుకున్నా. పైగా నాకు ఇష్టమైన జానర్ క్రైమ్ కామెడీ. అందుకే ఇష్టంతో కథ తయారు చేసుకున్నాను. ఇష్టమైన జానర్‌లో సినిమా తీయాలనే నా కల 'కీడాకోలా'తో నెరవేరింది..

**మా తాతే ఇన్‌స్పిరేషన్**

'పెళ్లి చూపులు' చిత్రానికి మాటల రచయితగా జాతీయ అవార్డు వచ్చింది. బరువుగా అనిపించింది. అర్జంట్‌గా ఫ్లాప్ ఇచ్చి ఆ బరువును దించేసుకోవాలని 'ఈ నగరానికి ఏమైంది' చేశా. అది కూడా హిట్ అయింది. బరువు ఇంకా పెరిగిపోయింది. నిజానికి ఈ రెండు సినిమాల విషయంలో చాలా టెన్షన్ పడ్డాను. కానీ 'కీడా కోలా' విషయంలో అస్సలు టెన్షన్‌లేదు. రెండుమూడుసార్లు చూసుకున్నా. హిట్ పక్కా. ఇందులో బ్రహ్మానందం, రఘుగారు తప్ప మిగిలిన అందర్నీ ఆడిషన్స్ చేసే తీసుకున్నాం. బ్రహ్మానందంగారి పాత్రకు ప్రేరణ మా తాతయ్యే. ఆయన పాత్రలో మా తాత పోకడలు చాలా కనిపిస్తాయి.

హీరో ఎవరో జనమే చెప్పాలి. ఇందులో ప్రతి పాత్రలో ఎంతో కొంత నాకు నేను కనిపిస్తాను. ముఖ్యంగా నాకోసం రాసుకున్న 'నాయుడు' పాత్ర చేస్తున్నప్పుడు నాలో ఉండే భారం సగం తగ్గిపోయినట్లు అనిపించింది. నా జీవితంలో నేను చూసిన ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలు ఇందులో ఉంటాయి. ఒక కథ రాస్తున్నప్పుడు ప్రతి పాత్రలోకి వెళ్లి ఆలోచించడం రచయితకు చాలా అవసరం. ఈ కథ విషయంలో ఓ మథనమే జరిగింది. ఇందులో మొత్తం ఎనిమిది పాత్రలున్నాయి. అందులో హీరో ఎవరు? నేను, నా రైటింగ్ టీమ్ బెట్ వేసుకున్నాం. మరి ఆడియన్స్ ఎవర్ని హీరో అంటారో చూడాలి.

**త్వరలోనే వెంకీతో..**

పైప్‌లైన్‌లో కొన్ని కథలున్నాయి. అలాగే వెంకటేశ్‌గారి సినిమా విషయంలోనూ త్వరలో ఓ క్లారిటీ ఇస్తాను. ఈ సినిమా ఫస్టాఫ్ రెడీగా ఉంది. సెకండాఫ్ విషయంలో సంతృప్తిగా లేను. సురేష్‌గారు షూటింగ్‌కు వెళ్లిపో అంటున్నారు. కానీ రచయితగా నేను సంతృప్తి చెందకుండా లొకేషన్‌కి వెళ్లలేను. త్వరలోనే సెకండాఫ్ విషయంలోనూ ఓ క్లారిటీ వస్తుంది. అలాగే ఓ వెబ్ సిరీస్ కూడా చేయబోతున్నా.

## అయిదు లోకాలు.. అయిదుగురు హీరోయిన్లు!



విజయావారి క్లాసిక్ 'జగదేకవీరునికథ' సినిమా గుర్తుందా? అందులో రామారావు.. ఇంద్రుడి కూతురైన జయంతిని, నాగేంద్రుడి కూతురైన నాగినినీ, వరుణదేవుడి కూతురైన వారుణిని, అగ్నిదేవుడి కూతురైన మరీచిని పెళ్లాడేసి జగదేకవీరుడు అనిపించేసుకుంటాడు. జయంతి పాత్ర పోషించిన బి.సరోజాదేవి అందులో మెయిన్ హీరోయిన్ అయితే.. మిగిలిన ముగ్గురూ సైడ్ హీరోయిన్లన్నమాట. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి కూడా ఇలాంటి కథతోనే ప్రేక్షకులను పలకరించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఇందులో కూడా చిరంజీవి.. దేవ, దానవ, పాతాళ, యక్ష, భూ లోకాలన్నీ తిరిగి వస్తాడంట. ఈ లోకాలన్నీ చుట్టొచ్చేది ఎందుకోసమంటే, ఓ పాప కోసం అని తెలుస్తున్నది. ఎలాగూ లోకాలు తిరుగుతున్నాడు కాబట్టి, లోకానికొక కథానాయిక ఉంటే సబబు అనుకున్నాడేమో దర్శకుడు వశిష్ఠ. మొత్తం అయిదు లోకాలకు గాను, అయిదుగురు హీరోయిన్లను ఖరారు చేసేపనిలో ఉన్నాడట. మొన్నటివరకూ అనుష్క, మృణాళ్ ఠాకూర్ పేర్లు మాత్రమే వినిపించాయి. రీసెంట్‌గా ఐశ్వర్యరాయ్ పేరు కూడా బలంగానే వినిపిస్తున్నది. మరో ఇద్దరు కథానాయికలను ఎంపిక చేయాల్సివుందని సమాచారం. మరి ఈ అయిదుగురిలో అసలు నాయిక ఎవరనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ చిత్రానికి సాయిమాధవ్ బుర్రా సంభాషణలు అందించనున్న విషయం తెలిసిందే.


## ఎక్స్‌ట్రార్డినరీ కామెడీ ఎంటర్‌టైనర్



నితిన్, శ్రీలీల

నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎక్స్‌ట్రా-ఆర్డినరీ మ్యాన్'. వక్కంతం వంశీ దర్శకుడు. శ్రీలీల కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో నితిన్‌ను జూనియర్ ఆర్టిస్ట్ పాత్రలో పరిచయం చేశారు. 'బాహుబలి-2' దండాలయ్యా పాటలో నాలుగో వరుసలో ఓ జూనియర్ ఆర్టిస్టుగా కనిపిస్తానని నితిన్ చెప్పడం, అందుకు కౌంటర్‌గా అతని తండ్రి రావు రమేష్ 'జూనియర్ ఆర్టిస్టువి..నీ కెందుకురా ఇన్ని ఎక్స్‌ట్రాలు' అంటూ సైటెర్ వేయడం చక్కటి వినోదాన్ని పంచింది. యాక్షన్, కామెడీ ప్రధానంగా టీజర్ ఆకట్టుకుంది. ఆద్యంతం హాస్యప్రధానంగా సాగే చిత్రమిదని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రానికి హారిస్ జైరాజ్ సంగీతాన్నందిస్తున్నారు సుధాకర్ రెడ్డి, నికితా రెడ్డి నిర్మిస్తున్నారు.

## సోషల్ మీడియాకు దూరం



దక్షిణాది ఇండస్ట్రీలో ప్రతిభావంతుడైన దర్శకుడిగా పేరు తెచ్చుకున్నారు లోకేష్ కనకరాజ్. ఇటీవలే 'లియో' సినిమాతో మంచి విజయాన్ని అందుకున్న ఆయన..తదుపరి ప్రాజెక్ట్‌ను సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో చేయబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఈ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు లోకేష్ కనకరాజ్. రజనీకాంత్ సినిమా కోసం ఆరు నెలల పాటు సోషల్ మీడియాకు దూరంగా ఉండబోతున్నట్లు తెలిపారు. 'లియో' సినిమాపై కొందరు కావాలని దుష్ప్రచారం చేశారని, అయితే అవేవీ సినిమా విజయాన్ని ఆపలేకపోయానని లోకేష్ కనకరాజ్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ 'కొన్ని యూట్యూబ్ ఛానెల్స్ వాళ్లు కావాలని 'లియో' చిత్రంపై తప్పుడు ప్రచారం చేశారు. ఈ విషయాలను నేను పట్టించుకోలేదు. ప్రస్తుతం రజనీకాంత్ సినిమాపైనే దృష్టి పెట్టబోతున్నా. ఇందులో ఆయన నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపిస్తారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొదలుపెట్టాం' అన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుంది.



సుప్రియ, నాగార్జున, జయేశ్ రంజన్, నాగ్‌అశ్విన్, వి.జి.విందా తదితరులు

## హైదరాబాద్ దేశ సినీ రాజధానిగా మారింది

'1974లో అన్నపూర్ణ స్టూడియోను ఓపెన్ చేశాం. నెలకు ఒక్క రోజు షూటింగ్ జరిగితే చాలు అనుకునే వాళ్లం. అప్పటికి హైదరాబాద్‌కు ఫిల్మ్ ఇండస్ట్రీ షిఫ్ట్ కాలేదు. అలాంటిది ఈ రోజు హైదరాబాద్‌లో సినీ పరిశ్రమ ప్రస్థానాన్ని చూస్తే చాలా గర్వంగా ఉంది. త్వరలో హైదరాబాద్ ఫిల్మ్ కేపిటల్ ఆఫ్ ఇండియాగా మారబోతున్నది. ఇప్పటికే అందుకు సరిపడా అన్ని హంగులను సమకూర్చుకున్నది' అన్నారు అగ్ర హీరో నాగార్జున. ఇండియా జాయ్, ఫ్లయింగ్ మౌంటెయిన్ కాన్సెప్ట్స్ సమర్పణలో సినిమాటిక్ ఎక్స్‌పో కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఇందులో సినీ ఇండస్ట్రీకి సంబంధించిన సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి పరిచయం చేశారు. ఈ కార్యక్రమానికి అగ్ర హీరో నాగార్జున, దర్శకుడు నాగ్‌అశ్విన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఇండస్ట్రీస్, కామర్స్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, తెలుగు సినిమాటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు పీజీ విందా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ 'తెలుగు ప్రజలకు సినిమా అంటే ప్రాణం. అందుకే దేశం మొత్తం వచ్చే వసూళ్లు ఒక్క తెలుగు రాష్ట్రాల్లోనే వస్తాయి. ఇప్పుడు సౌత్ ఫిల్మ్స్‌ను ఇండియా మొత్తం ఫాలో అవుతున్నది. మన సినిమాలు ఆస్కార్ వేదికల మీద సత్తా చాటుతున్నాయి. హైదరాబాద్‌లో సినీ సాంకేతిక పరిజ్ఞానం వృద్ధికి తెలంగాణ ప్రభుత్వం గొప్ప సహకారం అందిస్తున్నది. మంత్రి కేటీఆర్‌గారు, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ కృషి వల్ల హైదరాబాద్ టెక్నాలజీలో పురోగమిస్తున్నది' అన్నారు. ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ మాట్లాడుతూ 'కొత్తగా రాష్ట్రం ఏర్పడినప్పుడు యానిమేషన్, గేమింగ్ ఇండస్ట్రీ అంతగా అభివృద్ధి చెందలేదు. 2016లో తీసుకొచ్చిన పాలసీ ఎంతో ఉపయోగపడింది. చక్కటి ప్రణాళికలతో పాలసీలను అమలు చేశాం కాబట్టే ఈ స్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతున్నది' అన్నారు. గత పదేళ్లుగా తెలుగులో సాంకేతికంగా అద్భుతమైన సినిమాలొస్తున్నాయని, హాలీవుడ్‌వాళ్లు కూడా ఇక్కడికొచ్చి పనిచేస్తున్నారని దర్శకుడు నాగ్ అశ్విన్ చెప్పారు.



ధనుష్

## ఇళయరాజా బయోపిక్‌లో...

తమిళ అగ్ర హీరోల్లో ఒకరైన ధనుష్ తొలిసారిగా బయోపిక్‌లో నటించబోతున్నారు. సుప్రసిద్ధ సంగీత దర్శకుడు, మ్యాస్ట్రో ఇళయరాజా బయోపిక్‌లో ధనుష్ టైటిల్ రోల్‌ని పోషించబోతున్నారు. వెయ్యి చిత్రాలకుపైగా స్వరాలు అందించిన ఇళయరాజా భారతీయ సంగీత ప్రపంచంలో లివింగ్ లెజెండ్‌గా కొనియాడబడుతున్నారు. కనెక్ట్ మీడియా సంస్థ ఈ బయోపిక్‌ను పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కించబోతున్నది. ఇందులో నటించడానికి ధనుష్ అంగీకరించారని తెలిసింది. స్వతహాగా ఇళయరాజా అభిమాని అయిన ధనుష్..ఈ సినిమా అవకాశం రాగానే వెంటనే ఒప్పుకున్నారని అంటున్నారు. తన తండ్రి బయోపిక్‌కు ధనుష్ పర్ఫెక్ట్ ఛాయిస్ అంటూ ఇళయరాజా తనయుడు యువన్‌శంకర్‌రాజా సైతం ఆనందం వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ చిత్రం సెట్స్‌మీదకు వెళ్లనున్నట్లు తెలిసింది.

## కేదారేశ్వరుడంటే ఇష్టం



సారా అలీఖాన్

సైఫ్ ఆలీఖాన్ కుమార్తె, యువ కథానాయిక సారా అలీఖాన్‌ని ప్రతి ఒక్కరూ ప్రేరణగా తీసుకోవాలి. మనిషి కులమతాలకు అతీతంగా బతకాలని, భారతదేశం అంతా ఒకే కుటుంబమని నమ్మడమేకాక, అందుకు తగ్గట్టుగానే జీవితాన్ని మలచుకుంది సారా. తనలో ఇస్లామ్ మూలాలున్నా.. దేవాలయాలకెళ్లి పూజలు చేస్తూ ఉంటుంది సారా. అలాగే మజీద్‌కెళ్లి నమాజ్ కూడా చేస్తుంది.. ఈ విషయంపై అందరూ ఆమెను శభాష్ అంటూనే ఉన్నారు. తన తొలి సినిమా పేరు 'కేదార్‌నాథ్'. ఆ సినిమా చేసినప్పట్నుంచీ 'కేదార్‌నాథ్' దేవాలయంపై మక్కువ పెంచేసుకుంది సారా. రీసెంట్‌గా తను కేదార్ యాత్ర చేసింది. దానికి సంబంధించిన ఫొటోలను తన ఇన్‌స్టాలో పొందుపరచింది. దీనిపై ఆమె స్పందిస్తూ 'నా తొలి సినిమా 'కేదార్‌నాథ్'. ఆ సినిమా నుంచి కేదారేశ్వరుడంటే నాకిష్టం. బేసిగ్గా మా అమ్మ అమృతాసింగ్ ఈశ్వరభక్తురాలు. ఆమె నుంచే నాకీ శివభక్తి ప్రాప్తించి వుండొచ్చు.' అంటూ చెప్పుకొచ్చింది సారా అలీఖాన్.